# పెళ్లాం మనసు

ప్రతి రోజూ మధ్యాహ్నం పూట పడుకోవడం మాధవికి అలవాటు. అయినా ఆ రోజు నిద్ర పట్టలేదు. రకరకాల ఆలోచనలు ..

తను మాటిమాటికి పుట్టింటికి వెళ్ళాలని పట్టుబట్టదు కదా! పొద్దున నోరు తెరిచి అడిగితే, "ఇప్పుడొద్దు"అని భర్త తేలిగ్గా కొట్టి పారేస్తాడనుకోలేదు.

ఇదీ ఆమెను పీడిస్తున్న ఆలోచన.

భర్త ఎంత ప్రేమగా చూస్తున్నా వాళ్ళ కన్న తల్లిదండ్రులు వాళ్ళని చూడాలని తనకి అనిపించదా?

అడగలేక అడగలేక అడిగితే అంత తేలిగ్గా కొట్టి పారేస్తాడా? ఎంత సరిపెట్టుకుందామనుకున్నా ఈ తరహా ఆలోచనలు ఆమె బుర్రని తినేస్తున్నాయి.

తనెంతో ఆరాధిస్తున్న భర్త తనని చిన్న చూపు చూస్తున్నాడని మథనపడిపోతున్న ఆమె ఓ దృఢనిశ్చయానికొచ్చింది.

లాభం లేదు! భర్త అధికార దర్పానికి కళ్ళెం వెయ్యాలి!! లేకపోతే ఆయనలో నిరంకుశత్వం పెచ్చు పెరిగిపోతుంది!!!

ఇందుకు తనేం చెయ్యాలి? ఆలోచించసాగింది.

సాయంత్రం ఆయన ఆఫీసునుంచీ రాగానే తను నవ్వుతూ ఎదురెళ్ళకూడదు. అడిగిన తర్వాతే కాఫీ ఇవ్వాలి. మౌనవ్రతం పాటించాలి. పొరపాటున కూడా ఒక్క మాట కూడా మాట్లాడకూడదు- ఆయనెంత ప్రేమగా మాట్లాడినా!

రాత్రేకాదు- తెల్లవారిన తర్వాతకూడా తనదరి చేరనివ్వకూడదు. యాంత్రికంగా ఆయనకి సాయం చేస్తున్నట్లే కనిపించాలి గాని, ఆప్యాయత- అనురాగం మచ్చుకి కూడా వ్యక్తం కాకూడదు.

ఈ జాగ్రత్తలన్నీ తీసుకుంటే ఒక్క రోజుకల్లా దిగివస్తాడు. లేకపోతే ఇలా తన ఆధిక్యతను చూపుకుంటూనే పోతాడు.

మాధవి ఆలోచనలకన్నా వేగంగా టయిమ్ పరుగెత్తుతోంది!

అయిదున్నరయింది!

కృష్ణారావు ఆఫీసునుంచి వచ్చాడు.

సోఫాలో మూతి ముడుచుకూర్చున్న భార్యని చూసేసరికి అతని పుత్సాహమంతా నీరుకారిపోయింది. ఆమె ప్రక్కనే చతికిలబడ్డాడు.

అతను కూర్చోగానే ఆమె చటుక్కున లేచి నిలుచుంది.

"కోపం ఇంకా పోలేదన్నమాట?'' బూట్లలేసులు తనే విప్పుకుంటూ చిన్నగా నవ్వాడు కృష్ణారావు.

మాధవి విసవిసా లోపలికి వెళ్ళింది. కాఫీకోసం ఎదురుచూస్తున్న కృష్ణారావులో సహనం నశించింది. అయినా మాధవి వంటింట్లోంచి ఇవతలికి రాలేదు.

"రాణీగారూ! తమరు ఈ దాసుణ్ణి కనికరించాలి."తనే వంటింట్లోకి వచ్చాడు.

ఎదురుగావున్న కిటికీలోంచి బయటికి చూస్తూ నిలుచున్న మాధవి పులిక్కిపడింది.

"నాకు కాఫీ ఇవ్వబోతే ఇవ్వకపోయావ్. నువ్వయినా తాగావా?" ఫ్లాస్కులోని కాఫీని ఓ కప్పులోకి వంచి ఆమెకి అందించాడు కృష్ణారావ్.

భర్త ఆప్యాయతకి మాధవిలోని కోపమంతా కరిగిపోయింది.

అనవసరంగా ఆయన్ని తను బాధపెడుతోంది. తనని విడిచి వుండకే కదా ఆయన పంపనిది!

ఒక్క క్షణం ఆలోచించింది.

కానీ వెంటనే ఆమె అంతరాత్మ సినిమాల్లో లాగా ఎదురువచ్చి ఎదురు తిరిగింది. తప్పక బింకాన్ని చూపించసాగింది మాధవి.

"అంతకోపమైతే నేనెంత బాధపడతానో తెలుసా?" పాటందు కున్నాడు.

చెవులు మూసుకుని హాల్లోకి వచ్చేసింది మాధవి. ఆమె వెనుక కాఫీ కప్పుని పుచ్చుకుని బయల్దేరాడు కృష్ణారావు.

"మీరు నావెంట తిరక్కండి. మీ పని మీరు చూసుకోండి...." మాటల్లో కోపాన్ని చూపించడానికి ప్రయత్నిస్తూ అంది మాధవి.

''తమకి కాఫీ అందించడం కూడా నా పనే మేడమ్!" వినయ విధేయతల్ని వలకబోస్తూ కాఫీ కప్పుని తనకి అందించబోతున్న భర్తని చూసేసరికి కోపం కాస్తా పోయి నవ్వొచ్చేసింది ఆమెకి.

''వెరీగుడ్! అలా నవ్వాలి....నీకోసం ఏంతెచ్చానో చూడు''అంటూ పాంటు జేబులు వెదకసాగాడు.

ఏం తెచ్చాడో? ఆత్రంగా భర్తని గమనించిసాగింది మాధవి. తనంటే ఎంత ప్రేమ! కాస్త ముభావంగా వుంటే ఎంతగా తల్లడిల్లి పోతున్నాడు!!

''ఇదిగో, ఇది...." జేబులోంచి టికెట్టుని తీసి ఆమెకి అందించాడు కృష్ణారావ్.

"ఏమిటిది!?" ఆశ్చర్యంగా అడిగింది మాధవి ఆ టికెట్టుని అందుకుంటూ.

"మీ వూరికి టికెట్టు. రేపు రాత్రి ఎక్స్‌ప్రెస్‌కి" చిన్నగా నవ్వాడు అతను.

"ఎందుకు?" అర్థం కాలేదామెకి.

"పొద్దున. మీ ఇంటికి వెళ్ళి వస్తానని అడిగావు కదా?"

"నువ్వు వెళ్ళవద్దు. నిన్ను చూడకుండా ఒక్కరోజు కూడా వుండలేను...."అని బ్రతిమాలాడనుకున్న భర్త అలా రిజర్వేషన్ చేసుకుని మరీ వచ్చేసరికి ఆమెకి వళ్ళుమండిపోయింది.

"ఏం? నేను మా ఇంటికి వెళ్తే ఇంచక్కా మీరు మీ ఫ్రెండ్స్‌తో తిరగవచ్చని, పేకాడుకోవచ్చని ముచ్చటపడుతున్నారా? అసలు అటువంటివాళ్ళు పెళ్ళెందుకు చేసుకున్నారు?" ఆమె కళ్ళవెంట బొటబొటా నీరు కారసాగింది.

కృష్ణారావ్ అవాక్కయి పోయాడు.

పొద్దున ఇంటి కెళ్తానని అంతగా గొడవ చెయ్యబట్టే తన దగ్గర డబ్బులు లేకపోయినా ఓ మిత్రుడి దగ్గర అప్పు తీసుకుని మరీ ఆమె ప్రయాణానికి సన్నాహాలు చేసాడు. ఆనందంతో వికసిస్తుందనుకున్న భార్య ముఖం దుఃఖంతో ముడుచుకుపోయేసరికి అతని మనసు కుడితిలో పడ్డ ఎలుకలా కొట్టుకోసాగింది.

(కలువబాల పక్షపత్రిక)